శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త



## టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్

- వినతులు స్వీకరించిన మంత్రి ఫరూక్, ఎమ్మెల్సీ బీద



**నెల్లూరు, జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ (గ్రీవెన్స్) కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో కలిసి పాల్గొన్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించి, వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని ఫోన్‌ల ద్వారా పరిష్కామయ్యే కొన్ని సమస్యలను ప్రజా దర్బార్ వేదిక నుండి పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది.

## సిఎం చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కావలి నియోజకవర్గం అభివృద్ది



**కావలి, జనవరి 19 ప్రభాతవార్త** : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కావలి నియోజక వర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం సిఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం సహాయనిధికి 1250 మంది ధరఖాస్తులు చేసుకోగా 921మందికి రూ.7.42కోట్లు చెక్కులు అందజేశామని తెలిపారు. మరో 59మందికి రూ.15.95లక్షలచ సిఎం రిలీఫ్‌పండ్ కింద మంజూరు చేసినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సిఎం సహాయనిధి అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్ ఆశీస్సులతో 502మంది రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, టిడిపి నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, సోమశిల ప్రాజెక్టు మాజీ ఛైర్మెన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్ కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## కండలేరులో 61.110 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జనవరి 19, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో సోమ వారం ఉదయానికి 61.110 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఎఇ అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల, కండలేరు వరద కాలువ ద్వారా 1000 క్యూసెక్కుల నీరు జళాశయంలోకి వస్తుండగా జళాశయం నుండి హైలెవల్ కెనాల్ ద్వారా 100 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 200 క్యూసెక్కులు,కండలేరు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1110 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1410 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

# నిర్ణీత గడువులోపు అర్జీల పరిష్కారం

- పరిష్కార వేదికకు 308 అర్జీలు - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 19, ప్రభాతవార్త** సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, డిఆర్డిఏ పిడి నాగరాజు కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిడి నాగ శేఖర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ రెడ్డి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు మరియు పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్‌యల్‌ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా,మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాపిర్యాదుల పరిష్కార వేదికలో నూతనంగా ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పరిష్కార వేదికకు 308 అర్జీలు**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిష్కార వేదికకు 308 అర్జీలు వచ్చాయి దీంట్లో రెవెన్యూ 144, పంచాయితీ 22, పోలీస్ శాఖ 16, సర్వే ల్యాండ్ రికార్డ్స్ 12, మునిసిపాలిటీ 23, సివిల్ సప్లై 12, తదితర శాఖలలో మరిన్ని ఉన్నాయి.

## వన్ విలేజ్.. 4 విజిట్స్ వేగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు

- జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్






**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 19, ప్రభాతవార్త** వన్ విలేజ్.. 4 విజిట్స్ కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో వన్ విలేజ్ 4 విజిట్స్, రెవెన్యూ పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, పిజిఆర్ఎస్ అర్జీలు, యూరియా నిల్వలు, చాంపియన్ ఫార్మర్ కార్యక్రమం, గృహ నిర్మాణాల ప్రగతి తదితర అంశాలపై ఆర్డీవోలు, కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన్ విలేజ్ 4 విజిట్స్ కార్యక్రమంలో ప్రజలు, రైతులు తెలియజేసిన రెవెన్యూ సంబంధిత సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా డిసెంబర్ నెలలో ఈ కార్యక్రమం నిర్వహించిన గ్రామాల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా సమస్యల పరిష్కారం జరగాలని స్పష్టం చేశారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. చాంపియన్ ఫార్మర్లను ప్రోత్సహిస్తూ, వారి ద్వారా మిగిలిన రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు.పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యంగా, బాధ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి ఎండార్సుమెంట్లు ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి సమస్య మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. పరిష్కారం సాధ్యం కాకపోతే స్పష్టమైన కారణాలతో కూడిన ఎండార్సుమెంట్‌ను అర్జీదారునికి అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన నాణ్యతలోపం ఉన్న గృహ నిర్మాణాలను సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని మరమ్మతులు పూర్తి చేయించాలని హౌసింగ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్‌కుమార్, జడ్పీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, పశుసంవర్ధక శాఖ జెడి రమేష్ నాయక్, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాఫర్ అకాల మరణం తీవ్రంగా కలచివేసింది

- కుటుంబ సభ్యుని కోల్పోయినంతలా బాధ పడ్డా మంత్రి ఆనం
- జాఫర్ మృతి తెలుగుదేశం పార్టీకి, మైనార్టీ సమాజానికి తీరని లోటు
- మంచి నిబద్ధత గల నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరం
- జాఫర్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**నెల్లూరు, జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** : రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తెలుగుదేశం పార్టీ మైనార్టీ యువ నేత మహమ్మద్ జాఫర్ షరీఫ్ (జాకీర్) మృతి తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జాఫర్ అకాల మరణం తెలుగుదేశం పార్టీకి మాత్రమే కాదు, మైనార్టీ సమాజానికి కూడా తీరని లోటుగా మిగిలిపోయిందని అన్నారు. నెల్లూరు నగరం ఖుద్దుస్ నగర్‌లోని జాఫర్ నివాసానికి వెళ్లిన మంత్రి ఆనం శోకసంతప్త కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధాతప్త హృదయంతో ఉన్న వారు కుటుంబాన్ని ఓదార్చుతూ, ఈ కఠిన సమయంలో తెలుగుదేశం పార్టీ సంపూర్ణంగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జాఫర్ ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభమై, తన నిబద్ధతతో మైనార్టీ సెల్‌లో చురుకైన యువ నాయకుడిగా ఎదిగారని మంత్రి గుర్తు చేశారు. కార్యకర్తలతో కలిసిమెలిసి పనిచేస్తూ, పార్టీ బలోపేతమే లక్ష్యంగా నిరంతరం శ్రమించిన నిజాయితీ గల నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ముస్లిం సమాజంలో తెలుగుదేశం పార్టీకి బలమైన స్వరం జాఫర్‌గా నిలిచారని ప్రశంసించారు. పార్టీ, ప్రజాసేవ పట్ల జాఫర్ చూపిన అంకితభావం రాబోయే తరాల కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి ఆనం తెలిపారు. ఈ విషాదాన్ని భరించే శక్తిని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ, జాఫర్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, మైనార్టీ సెల్ ప్రతినిధులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగి వేమన బోధనలు సమాజానికి మార్గదర్శకాలు

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 19, ప్రభాతవార్త** యోగి వేమన బోధనలు సమాజానికి మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో యువజన సర్వీసుల శాఖ,(సెట్నెల్) వారి ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్, వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**కలెక్టర్ మాట్లాడుతూ** యోగి వేమన తన సరళమైన పద్యాల ద్వారా సత్యం, నైతికత, సమానత్వం, మానవత్వం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. కులమత భేదాలు, మూఢనమ్మకాలు, అజ్ఞానంపై ధైర్యంగా పోరాడిన సమాజ సంస్కర్తగా వేమన నిలిచారని పేర్కొన్నారు. వేమన రచించిన యోగి వేమన శతకం, తత్త్వ శతకంలలోని భావాలు నేటి సమాజానికి అత్యంత ముఖ్యమని, యువత వాటిని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. యోగి వేమన తన బోధనల ద్వారా తెలుగు సాహిత్యంలో, సమాజ చైతన్యంలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసి మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్, సెట్నెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీలు స్వీకరించిన ఇన్‌చార్జ్ మేయర్, కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, జనవరి 19 ప్రభాతవార్త** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిస్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషణర్ వై.ఓ.నందన్‌లు పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యాయంలోని కంట్రోల్ సెంటర్ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న వాటి పరిష్కారానికై ప్రజా సమస్యల పరిష్కార వేదికను సంద్శించాలని సూచించారు. సమస్యలను నిర్ధేశించిన గడువులోపు పూర్తి చేసేందుకు కమిషనర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు అందరూ కృషి చేస్తారని వివరించారు. నగరపాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని మేయర్ తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన లబ్దిదారులుందనూ టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆస్థిపన్ను, ఖాళీస్థలం పన్నులను చెల్లించి నగర వ్యాప్తంగా జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులలో బాగస్వాములు కావాలని సూచించారు. నిర్దేశించిన సమయంలోపు పన్నులు చెల్లించాలని తెలిపారు. అనదికార లేవుట్లలోని ప్లాట్లు యజమానులు, పట్టణ ప్రణాళిక విభాగం అనమతులను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టిన భవన యజమానులు ఎల్ఆర్ఎస్, బిపిఎస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీది శునకాల నియంత్రణలో భాగంగా ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్‌ద్వారా అన్ని డివిజన్లలో శునకాలను పట్టి పాత మున్సిపల్ కార్యాలయంలోని ఏబీసీ సెంటర్ ద్వారా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో టిడ్కో హౌసింగ్ 17, టౌన్‌ప్లానింగ్ 12, రెవెన్యూ 2, ఇంజనీరింగ్ 5, పబ్లిక్‌హెల్త్ 3, అప్కాన్ 2 మొత్తం 41 వినతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటి కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతుజానీ, ఈఈ శేషగిరిరావు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, పట్టణ ప్రణాళికా విభాగం ఇన్‌చార్జ్ సిటి ప్లానర్ రఘునాథరావు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విబాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని డివిజన్లలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్



**నెల్లూరు కార్పోరేషన్, జనవరి 19 ప్రభాతవార్త** :ెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రతిరోజూ ఫాగింగ్ ప్రక్రియను అమలు చేస్తూ, ఆయిల్ బాల్స్ పిచికారి, డ్రైను కాలువల పూడికతీత తదితర కార్యక్రమాలతో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నామని మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తెలిపారు. కమిషనర్ వై.ఓ.నందన్ నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులత సమీఓ సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. సమీక్ష సమావేశంలో టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్బంగా మేయర్ మాట్లాడుతూ ప్టట్టణ పురపాలకశాఖ మంత్రి నారాయణ, రూరల్ నియోజకవర్గ శాసనభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల ఆలోచనల మేరకు నగర వ్యాప్తంగా దోమల నివారణ చేపట్టాల్సిన చర్యలపై అందరి అభిప్రాయాలను చర్చించి ప్రణాళికలను రూపొందించేందుకు సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. దోమల నివారణతో పాటు వీధికుక్కల నియంత్రణ, రోడ్లపై పశువుల సంచారం, ప్రజలను ఇబ్బంది పెట్టె కోతుల సంచారం అంశాలపై పటిష్టమైన కార్యాచరణను రూపొందించి, స్తానిక కార్పోరేట్‌లను సమన్వయం చేసుకుంటూ అమలు చేయనున్నామని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి గిరిదర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్, రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల సహాకరంతో నియోజకవర్గంలో అత్యంత వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. దోమలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతూ రూరల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రదాన సమస్యగా ఈ అంశాన్ని తెలియజేస్తున్నారని వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ 54 డివిజన్లలను 9జోన్లుగా విభజించి దోమల నిర్మూళనకు శానిటేషన్ సిబ్బందిచే ప్రత్యేక కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించేందుకు నిర్ణయించామని తెలిపారు. నూతనంగా కొనుగోలు చేసిన పాగింగ్ మిషన్లు కూడా ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేవంలో వివిధ డివిజన్ల కార్పోరేటర్లు, ఆరోగ్యశాఖ అదికారి డాక్టర్ కనకాద్రి, మలేరియా విభాగం డాక్టర్ జిజియా, వెటర్నరీ వైద్యులు మదనమోహన్, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

## మరుగుదొడ్డి పేరుతో శిధిలావస్థ భవనంపై టిడిపి నేత కన్ను

డొంక మరమ్మతుల కోసం లక్షరూ ఎమ్మెల్యే సహాయం

ఎమ్మెల్యే కి చెడ్డ పేరు తీసుకువస్తున్న టిడిపి నాయకులు





**విడవలూరు,జనవరి 19 ప్రభాతవార్త** : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పశు వైద్యశాల అధికారులకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అంచనా వేసి మూడు లక్షలు మంజూరు చేశారు. ఈ పనులను స్థానిక టిడిపి నాయకులు కాంట్రాక్టర్లుగా కుదుర్చుకున్నారు. పశు వైద్యశాల ఆవరణంలో సుమారు ఎకరం స్థలం ఉండగా శిధిలవస్థలో ఉన్న వైద్యశాలను జెసిబితో అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా ఆదివారం కూల్చివేశారు. సోమవారం కూల్చివేసిన రబ్బిస్ను జెసిబి, ట్రాక్టర్లు సహాయంతో మన్మధరావుపేట డొంక సదునకు తరలించారు. ఈ డొంక మరమ్మతులకు గురై రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు విన్నవించుకోగా స్పందించిన ఎమ్మెల్యే లక్ష రూపాయలు విరాళంగా రైతులకు అందజేసిన విషయం తెలిసిందే. అయితే పశు వైద్యశాల చిన్నపాటి వర్షాలకే చెరువులను తలపిస్తుంటాది. శిథిలావస్థ భవనం కూల్చివేసిన మట్టిని ప్రాంగణంలో సదును చేయకుండా చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకున్నట్టు ఎమ్మెల్యే రైతులకు ఇచ్చిన లక్ష రూపాయలను టిడిపి నాయకులు జేబులు నింపుకునేందుకు ట్రాక్టర్ల ద్వారా డొంకకు తరలిస్తున్నారు.

## యోగి వేమనకు నివాళులర్పించిన ఎస్పీ



**నెల్లూరు క్రైమ్, జనవరి 19, ప్రభాతవార్త** జిల్లా పోలీస్ కార్యాలయంలో యోగి వేమన జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి ఎస్పీ అజిత వేజెండ్ల పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వేమన రైతుబిడ్డగా జన్మించి, సాహసికుడు, స్వచ్ఛందుడు, సామాజిక చైతన్యాన్ని తన పద్యాల ద్వారా ప్రజల్లో నింపారని ఎస్పీ పేర్కొన్నారు. సమాజంలోని మూడనమ్మకాలు, దురాచారాలను ప్రశ్నిస్తూ వివిధ కోణాల్లో విశ్లేషించి, తన కవిత్వంతో ప్రజలను జాగృతం చేశారని తెలిపారు. ఇటువంటి తెలుగు కవుల ఔన్నత్యాన్ని గుర్తు చేసుకోవడం, వారి భావజాలాన్ని తరతరాలకు అందించడం మన కర్తవ్యమని తెలిపారు. ఇటువంటి మన తెలుగుకవుల గొప్పదనాన్ని, వారి ఔన్నత్యాన్ని చాటి చెప్పడం, స్మరించుకోవడం మన కర్తవ్యమని తెలిపారు.

## కరెంటు లైన్ తీగ తెగిపోయిన పట్టించుకోని అధికారులు



**ఉదయగిరి, జనవరి 19, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని గుడి నర్వ ఎస్వి చింతల మధ్యలో ఆరో నెంబరు కాలువ దగ్గర కొత్తగా వేసిన లైన్ తీగలు తెగిపోయి 20 రోజులు అయినా పట్టించుకోని అధికారులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వెంటనే మరమ్మత్తులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆ రోడ్డు నిత్యం వాహనదారులు, పశువులు పొలాలు ఉన్నాయి. ఏ సమయంలో ఏం జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. కావున అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం



**బుచ్చి జనవరి 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపిపి అద్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ యస్.రంతులయ్య తెలిపారు. ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు, తప్పక హాజరు కావాలని ఆయన పిలుపు నిచ్చారు.

## రీ సర్వేలో తప్పులు తడకలను సరిచేయాలి



**కావలి, జనవరి 19 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ రాష్ట్రపార్టీ పిలుపు మేరకు జిల్లా పార్టీ ఆదేశాను సారం బిజెపి పట్టణ అధ్యక్షులు మంద కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జనతా వారిది కార్యక్రమం నిర్వహించి ప్రజాసమస్యల పరిష్కార వేధిక కార్యక్రమంలో స్థానిక ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణకు రీసర్వేలో జరుగుతున్న తప్పులను సరిచేయాలని, ముసునూరు ఇందిరమ్మ కాలనీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ కావలి డివిజన్ పరిధిలో చేపట్టిన రీ సర్వేలో అనేక మంది రైతులు భూముల సర్వే నెంబర్లు తప్పు పడటం, రీసర్వే చేసిన పొలాలకు సంబంధించిన సమగ్రమైన నివేదిక రైతులకు అందించడం కిందిస్థాయిలో జరగడం లేదని తెలిపారు. పంట పొలాలు బీడుభూములు రైతులకు అవగాహన కల్పించి ఆన్లైన్ చేసి తరువాత వన్‌బి అడంగల్ వెంటనే అందజేయాలని కోరారు. ప్లాట్ నెంబర్లు, ఇంటి పేర్లు తప్పులు పడితే అప్పిలు చేయమని ప్రభుత్వం తెలియజేస్తుంటే క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం ఫిర్యాదు చేయమని రైతులకు చెబుతున్నారు. రైతులకు అవగాహన లేక కార్యాలయం చుటూట ప్రదక్షణలు చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను రిజర్వు భూములు కబ్జాకు గురికాకుండా పరిరక్షించాలని కోరారు.సాన్‌మోర్చా రాష్ట్ర ఉపా ధ్యక్షులు సన్నిగంటి సీనయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు అంచిపాక కమల, పట్టణ ప్రధాన కార్యదర్శి గుడిపల్లి ప్రసన్నకుమార్, కార్యదర్శి మట్ట మల్లికార్జున, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు మంగమూరి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## మీ రాజకీయాలకు మా జీవితాలు బలి చేయవద్దు

## కుమ్మర కులస్తుల ఆవేదన



మనుబోలు **జనవరి 19 ప్రభాతవార్త** మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన కుమ్మర కులానికి చెందిన కుటుంబాల వారు సోమవారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కుమ్మర కుల అధ్యక్షులు కంద్రాతి రాజశేకర్ ఆద్వర్యంలో వారు మాట్లాడుతు మనుబోలు మండలంలో సుమారు కుమ్మర కులస్తులు 150 కుటుంబాల వారు కొలిమి పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నామని మా కులస్తులకు 2009 వ సంవత్సరం నుండి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్‌టిలుగా పరిగణించి సర్టిఫికేట్లు మంజూరు చేస్తున్నారని మనుబోలు మండలంలో కూడా పలు గ్రామాలకు చెందిన మాకులస్తులకు గతంలో ఎస్‌టి కుల సర్టిఫికేట్లు మంజూరు చేసి ఉన్నారని వారు తెలిపారు. ప్రస్తుతం అక్కం పేట గ్రామంలో 32 కుటుంబాల వారు ఉన్నామని తాము ఎస్‌టి కుల సరిఫికేట్లు మంజూరు చేసి ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం అక్కంపేట గ్రామంలో 32 కుటుంబాల వారు ఉన్నామని తాము ఎస్‌టి కుల సర్టిఫికేట్లు కోసం ధరఖాస్తు చేసి ఉండగా అక్కంపేట గ్రామానికి చెందిన కొంతమంది రాజకీయ నాయకులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం మీ రాజకీయాలను పక్కన పెట్టి పార్టీలకు అతీతంగా తమకు ఎస్‌టి కుల సర్టిఫికేట్లు మంజూరు అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. కొన్ని మీడియా మాద్యమాల్లో తమ గ్రామానికి చెందిన టిడిపి తిరుపతి పార్లమెంట్ కమిటి అధికార ప్రతినిధి ఎస్‌కె అమీర్‌బాషా, నీటి సంఘం అధ్యక్షులు ఏలూరు కోదండరామిరెడ్డిలపై డబ్బులు తీసుకొని కుల ద్రువీకరణ పత్రాలను మారుస్తున్నారు అని వస్తున్న అరోపణలను వారు ఖండిస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా శ్రీకాశీనాయన 130వ జయంతి



**సీతారామపురం జనవరి 19 ప్రభాతవార్త** సద్గురు శ్రీకాశీనాయన జన్మస్థలమైన సీతారామపురం మండలంలోని బెడుసుపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన కాశీనాయన 130 జయంతి వేడుకలలో ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ,మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి ,కాంగ్రెస్‌పార్టీ కి చెందిన మాజీ ఎంఎల్‌సి తులసిరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కాశీనాయన కుటుంబీకులు బిజెపి నేతలు ,ముడమాల రమేష్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డిలు, ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికి స్వామి వారి పట్టు వస్త్రాలను సమర్పించారు.అనంతరం విశ్వహిందూ పరిషత్ ఆద్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు.ఈకార్యక్రమంలో మాజీ టిడిపి కన్వీనర్లు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, కప్పా ప్రభాకర్‌రాజు, మండల టిడిపి యూత్ కన్వీనర్ పసుపులేటి వికాస్ బాబు, టిడిఎ నాయకులు యడమ ప్రవీణ్,పిడుగు రమేష్, కుర్రా రత్తయ్యయాదవ్, జనసేన నాయకుడు బోగినేని కాశీరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చెరువుసంఘంకు నీటిసరఫరా చేయాలి



**కావలి, జనవరి 19 ప్రభాతవార్త :** పట్టణంలోని 36వ వార్డు చెరువు సంఘంకు సుమారు మూడు నెలల నుండి నీటిసరఫరా ఆగిపోవడంతో సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్‌కు చెరువు సంఘం ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సంఘానికి మూడు నెలలుగా నీటి సరఫరా ఆగిపోయిందని దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని తెలిపారు. ఇక్కడ సుమారు వంద కుటుంబాలు నివాసాలు ఉంటున్నారని ఇక్కడి వారంతా పేదవారని పేర్కొన్నారు. మూడు నెలల నుంచి నీటిసరా ఆగిపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ట్యాంకర్ల ద్వారా మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీటిని వదులుతున్నారని అవి చాలకపోతున్నాయన్నారు. మా సంఘానికి నీటిసమస్య తీర్చేందుకు సుమారు ఏడాది క్రితం పైపులైను వేసి కుళాయిలు అమర్చారని తెలిపారు. వేసిన కొద్దిరోజులు బాగా నీరు వచ్చాయని ఇప్పుడు మూడు నెలలుగా నీటిసరఫరా ఆగిపోయిందన్నారు. నీటిసమస్య వెంటనే తీర్చాలని వినతిపత్రంలో కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంల సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయకులు బి.క్రిష్ణయ్య, జి.మధుసూదనరావు, సిపిఎం నాయకులు మేడా వెంకటేశ్వర్లు సంఘం ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాదిహామీ చట్టాన్ని పునరుద్దరించాలి



**కావలి, జనవరి 19 ప్రభాతవార్త** : మహాత్మగాంధీ జయాతీ ఉపాధిహామీ చట్టాన్ని పునరుద్దరించాలని కోరుతూ సోమవారం రూరల్ మండలం గౌరవరం, అరుంధతివాడ, హరిజనవాడ, గౌడవీధుల్లో ఇంటింటా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు టి.మల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాదాక్రిష్ణయ్య, గ్రామ కార్యకర్తలు దేవరపల్లి లక్ష్మికాంతమ్మ, శెట్టిపల్లి రమణయ్య, మేడుబల్లి రమణయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. పాత చట్టాన్ని కొనసాగించాలని కొత్త చట్టాన్ని నిలుపుదల చేయాలని కోరారు. కొత్తచట్టం వల్ల ఉపాధి హామీ లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. అందుచేత నూతన చట్టాన్ని ఆపి పాత చట్టాన్ని అమలు చేయాలని కోరారు.

## గుంటపోరంబోకు భూమిని కబ్జా చేస్తున్నారంటూ ఫిర్యాదు



దగదర్తి, జనవరి 19, ప్రభాతవార్త గ్రామానికి చెందిన పశువుల కోసం వినియోగించుకుంటున్న గుంటపోరంబోకు భూమిని కబ్జా చేస్తున్నారని, అనంతరం గ్రామం లయన్స్ నగర్, కొత్తపల్లి కౌరగుంట చెందిన గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ పి.కృష్ణకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ లయన్స్ నగర్ కాలనీలో ఎస్సీలు గత 50 సంవత్సరాలుగా పశువులకు మేత, తాగునీటి అవసరాల కోసం సుమారు 5 ఎకరాలను వినియోగించుకుంటూ ఉన్నామని, ఇదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు భూమిని ఆక్రమించేందుకు జేసీబీల సహాయంతో చదును చేస్తున్నారని అన్నారు. గ్రామస్తులంతా కలిసి ఆక్రమణను అడ్డుకున్నామని వారు తెలిపారు. గతంలో కూడా ఇదే విధంగా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే గ్రామస్తుల ఫిర్యాదుతో అధికారులు వారిని అడ్డుకుని కేసులు పెట్టారని అన్నారు. గ్రామ సరిహద్దులలో ఉన్న కొత్తపల్లి కౌరగుంటకు చెందిన భూములను సైతం చదును చేస్తున్నారని వారు తెలిపారు. తమ గ్రామానికి చెందిన గుంటపోరంబోకు భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని ఆక్రమణదారుల నుండి భూమిని కాపాడాలని కోరారు. విషయంపై తహసీల్దార్ పి.కృష్ణ మాట్లాడుతూ ఆక్రమణకు గురవుతున్న భూమిని పరిశీలించి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

## దగదర్తిలో వాహనాల తనిఖీ



**దగదర్తి, జనవరి 19, ప్రభాతవార్త** దగదర్తి వెలుపోడు సెంటర్లో సాయంత్రం కావలి సబ్ డివిజన్ పోలీసు అధికారి పి.శ్రీధర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా వాహనదారులందరూ సరైన పత్రాలు లేని వారికి చలానాలు వేసి హెల్మెట్ ఆవశ్యకతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. దగదర్తి మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై పోలీసు వారు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ వాహన తనిఖీలో కావలి రూరల్ సీఐ బి.పాపారావు, దగదర్తి ఎస్సై జంపాని కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం

**- జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల**



**నెల్లూరు క్రైం, జనవరి 19, ప్రభాతవార్త:** జిల్లా పోలీ సు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరి ష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ అజిత వేజెండ్ల స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడించి, వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 95 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వేదాయపాలెంకి చెందిన మహిళకి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని, దగదర్తికి చెందిన కత్తి నరేంద్ర అనే వ్యక్తి రూ. 5 లక్షలు నగదు తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. రాపూరుకి చెందిన మహిళ కుమారుడు చెడు అలవాట్లకు బానిసై తననీ తన కుటుంబ సభ్యుల్ని ఇబ్బంది పెడుతున్నాడని, తన కుమారునికి ముగ్గురు కుమార్తెలని, వారి బాగోగులు చూసుకోకపోగా, సంక్రాంతి రోజు తన మనవరాళ్లపై వేడి నీళ్ల పోసి తీవ్రంగా గాయపరిచినట్లు, ప్రాణ హాని ఉందని, వేధిస్తున్నాడని, అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కోవూరుకి చెందిన వ్యక్తి తన పెద నాన నాగభూషణం కోవూరులోని గరీబ్ హోటల్ నందు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నపుడు ఈ నెల 14న రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని, కోవూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు, ప్రమాదం జరిగిన సమయంలో హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని, లోతుగా విచారణ జరిపి తన పెదనాన్న మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకూరుపేటకి చెందిన మహిళను, తన భర్త శారీరకంగా మానసికంగా వేధిస్తున్నట్లు, దానికి తన అత్తింటి వారు కూడా సపోర్ట్ చేస్తున్నట్లు, కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబానికి చక్కదిద్దాలని అదే విధంగా బాలాజీ నగర్ పరిధికి చెందిన మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు, భర్త విడాకులు ఇవ్వాలని వేధిస్తున్నాడని, భర్త అత్తమామలు ఆడపడుచులు శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సిహెచ్ సౌజన్య, రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పిసిఆర్ సిఐ భక్తవత్సల రెడ్డి, మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని బిజెపి నాయకులు తహశీల్దార్‌కి వినతి



**పొదలకూరు, జనవరి 19, ప్రభాతవార్త** పొదలకూరు ఎమ్మార్వో ఆఫీస్ నందు జనతా వారధి, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని తాసిల్దారుకి బిజెపి నాయకులు సోమవారం వినతిపత్రం అందజేసారు. అనంతరం బిజెపి నాయకులు మాట్లాడుతూ మండలంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పూల ప్రశాంత్, మండల ఉపాధ్యక్షులు చొప్ప వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి అక్కెం జనార్దన్ రెడ్డి, బిజెపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొద్దు గురుస్వామి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు ఎం కృష్ణయ్య, సోషల్ మీడియా కన్వీనర్ దుర్గేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముక్కు రామయ్య, బిజెపి సీనియర్ నాయకులు చింత గింజల సుబ్రహ్మణ్యం, సిహెచ్ రంగారావు, మాముదూరు రవీంద్ర, మహిళా ఉపాధ్యక్షురాలు టి. పవిత్ర, పి. రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరమణారెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పరామర్శ



తోటపల్లి గూడూరు, జనవరి 19, ప్రభాతవార్త మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ప్రముఖ రైతు నాయకుడు కావలి రెడ్డి వెంకటరమణారెడ్డి ఇటీవల కాలంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి విచారం వ్యక్తం చేస్తూ, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోడూరు గ్రామానికి చేరుకుని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దివంగత నాయకుడి కుమారులైన నరేందర్ రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డిలకు ప్రశాంతి రెడ్డి ధైర్యం చెప్పారు. గ్రామాభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారంలో వెంకటరమణారెడ్డి పోషించిన పాత్రను ఆమె గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు గ్రామానికి తీరని నష్టమని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని దివంగత నేతకు నివాళులు అర్పించారు. కోడూరు గ్రామంలో శోకసంద్రభంగా వాతావరణం నెలకొంది.

## సాగరంలో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు పంపిణీ



**అనంతసాగరం, జనవరి19,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలో సంక్రాంతి పండుగ సందర్భంగా జాలీబాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసాయి. ఈసందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజే శా రు. మొదటి విజేతగా వికెట్ వారియర్స్ టీమ్ గెలుపొందారు. రన్నర్స్‌గా జాలీబాయ్స్ టీమ్ నిలిచింది. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సమకూరించిన మందా కృష్ణా, వడ్లపల్లి శ్రీను, చింతామల్ల విష్ణుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో ఎంపిడిఓ ఇజాక్‌ప్రవీన్, ఎస్ఐ సూర్యప్రకాష్, బొర్రా బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతు నాయకులు అప్పలరాజును వెంటనే విడుదల చేయాలి



విడవలూరు, జనవరి 19, ప్రభాతవార్త : కార్పొరేట్లకు భూములు దోచిపెట్టి దాంట్లో భాగంగా భూసేకరణకు వ్యతిరేకంగా నిలబడేటటువంటి నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని కౌలు సంఘ జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రం సిపిఎం పార్టీ కార్యాలయంలో రైతు నేత అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని పోస్టర్లను విడుదల చేస్తూ డిమాండ్ చేశారు. గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమాలు చేసే వాళ్ళని ప్రజలకు అండగా నిలబడే నాయకుల్ని అరెస్టులు చేయటం చాలా దుర్మార్గ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రాష్ట్ర ప్రభుత్వం కూడా అనుసరిస్తూ కార్పొరేట్లకు భూములు దోచిపెట్టే దాంట్లో భాగంగా భూసేకరణకు వ్యతిరేకంగా నిలబడేటటువంటి నాయకుల్ని పీడీ యాక్ట్ పెట్టి అరెస్టు చేయటం దుర్మార్గమైన ఆలోచనని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక ఉద్యమాలు చేసింది.కాకినాడ రైతు నాయకులు అప్పలరాజు ని విడుదల చేయాలని పిడి యాక్టిని ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల అధ్యక్షులు మడపర్తి అంకయ్య, కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షులు కుడుముల మోహన్ రావు,తలారి సురేష్, బండ్ల కృపాకర్ పాల్గొన్నారు.

## యోగివేమన బోధనలతో సామాజిక చైతన్యం



**నెల్లూరు అగ్రికల్చర్, జనవరి 19, ప్రభాతవార్త** నెల్లూరులోని రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో యోగివేమన జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఏవో వి.శైలేంద్ర కుమార్, సిబ్బందితో కలిసి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ యోగి వేమన తన బోధనల ద్వారా సమాజంలో చైతన్యాన్ని నింపారని వివరించారు. ముఖ్యంగా కుల మత బేధాలు, మూఢనమ్మకాలపై ధైర్యంగా పోరాడిన సమాజ సంస్కర్తగా వేమన నిలిచారని పేర్కొన్నారు. యోగి వేమన శతకం, తత్వ శతకంలోని భావాలు నేటి సమాజానికి అవసరమని యువత వాటిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరల తినాలి: స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు,జనవరి19 ప్రభాతవార్త:** ప్రజలు ఆరోగ్యం ఉండాలంటే పకృతి వ్యవసాయంతో పండించిన పంట ఆకుకూరలు తినడం తద్వారా మంచి ఆరోగ్యం పొందుతారని స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాల యంలో పకృతి వ్యవసాయంతో పండించిన ఆకు కూరలు స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు కె. స్ఫూర్తి రెడ్డి మాట్లాడుతూ పకృతి వ్యవసాయంతో పండిన ఆకుకూరలు తినడం వలన ఆరోగ్యానికి మంచిదన్నారు.పంటలు పం డించిన రైతుల వద్ద నుండి నేరుగా వినియోగదారులకు అమ్మకాలు చేసినట్లు ఆమె అన్నారు. డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఏ ఎస్ ఓ గాయత్రి,జూనియర్ అసిస్టెంట్ ప్రసన్న,ఎంటి శ్రీకాంత్ పకృతి వ్యవసాయ యూనిట్ ఇంచార్జ్ జి.కవితరాణి,ఖాసింబి,పి.అనూ ష,రాంప్రసాద్, పి.రవీంద్ర,కలిదేవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఉచిత జింక్ సల్ఫేట్ పంపిణీ

ఆత్మకూరు , జనవరి19, ప్రభాతవార్త: ఆత్మకూరు మండలంలో వ్యవ సాయ భూముల్లో భూసార పరీక్షలు నిర్వహించిన అనంతరం 642 మందిరైతులకు వారినేలలో అవసరమైన జింక్ సల్ఫేట్‌ను వ్యవసాయ శాఖ అధికారులు పంపిణీ చేశారు. ఆత్మకూరు వ్యవసాయ శాఖ కా ర్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారి కిషోర్ బాబు వారి సిబ్బంది రైతులకు వీటిని ఉచితంగా అందించారు. జింక్ లోపించిన భూముల్లో ముడి జింకు, స్ప్రే జింకును రైతులకు అందించారు. వీటి ద్వారా జింక్‌లోపించిన భూములు సారవంతంగా మారి పంటలు బాగా పండుతాయని కిషోర్‌బాబు తెలిపారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరిన అరుంధతి వాడ ప్రజలు

**ఉదయగిరి, జనవరి 19, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరిలోని గండిపాలెం మార్గంలో ఉండే అరుంధతి వాడలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. మురికి కాలువలోకి మురికి నీరు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పక్కన ఉండే దుకాణాల మీదకి వెళ్తుండడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సంబంధిత పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అటు వైపు నుంచి ఇటు వైపు నుంచి పోయే ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని సంబంధి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే డ్రైనేజీలను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పెనుబర్తిలో 36 లక్షల విలేజ్ క్లినిక్‌కు శంకుస్థాపన

**నెల్లూరు రూరల్‌లో వేగంగా అభివృద్ధి పనులు**



**నెల్లూరు రూరల్, జనవరి 19, ప్రభాతవార్త :** నియోజకవర్గ పరిధిలోని పెనుబర్తి గ్రామంలో 36 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ విలేజ్ క్లినిక్ భవనానికి నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీ డీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిం చాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాల్లో భాగంగా ఈ విలేజ్ క్లినిక్ నిర్మాణం జరుగుతుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యు వనేత రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వందల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా నెల్లూరు రూరల్ మండలంలో మాత్రమే 116 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. మాటకు కట్టుబడి ప్రజల పక్షాన నిలబడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ రెండు కళ్లలా భావించి పనిచేస్తున్నామని, గతంలో ఎన్నడూ లేని విధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో శాసనసభ్యులు శ్రీధర్ రెడ్డి సారధ్యంలో రూరల్ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, గుండ్లపాలెం పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ పముజుల ప్రదీప్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పల్లంరెడ్డి రవీంద్ర రెడ్డి, ఎన్‌టీఏస్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఏలూరు శివయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో పారిశుధ్య లోపాలపై ఆకస్మిక తనిఖీ



**నెల్లూరు, జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రజల నుంచి వరుసగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో జి.జి.హెచ్. అభివృద్ధి కమిటీ చైర్మన్ మడపర్తి శ్రీనివాసులు తో కలిసి ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో నేటి ఉదయం అధికారులు, అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి పారిశుధ్య పరిస్థితులను కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రి వార్డులు, కారిడార్లు, మరుగుదొడ్లు, అవుట్ పేషెంట్ విభాగాల పరిస రాలను పరిశీలించిన ఆయన, అక్కడి పారిశుధ్య లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ప్రభుత్వ ఆసుపత్రిపై ఆధారపడుతున్నారని,అలాంటి పరిస్థితుల్లో పారిశుధ్య నిర్వహణలోఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. వెంటనే పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చాలని సిబ్బందికి, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజల ఆరోగ్య విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అవసరమైతే తరచూ తనిఖీలు కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.జి.హెచ్. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మడపర్తి శ్రీనివాసులు, డైరెక్టర్లు బ్రహ్మారెడ్డి, దారా మల్లి, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ భీమినేని మురహరి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో క్యాన్సర్ ను జయించవచ్చు



**నెల్లూరు జనవరి 19 ప్రభాతవార్త వైద్యం** : అబై డింగ్ హోప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సుమారు 100 మంది క్యాన్సర్ బాధితులకు నెల్లూరులోని ట్రస్ట్ కార్యాలయంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ,"క్యాన్సర్‌తో పోరాటం శరీరానికే పరిమితం కాదని , అది మానసిక స్థైర్యంతో కూడిన యుద్ధంఅన్నారు . క్యాన్సర్ బాధితులకు అబైడింగ్ హోప్ ట్రస్ట్ సేవా సంస్థ అం డగా నిలుస్తుందన్నారు . ఈ ప్రయాణంలో క్యాన్సర్ బాధితులు ఒంటరివారు కాదని మీకు తోడుగా పలు సేవా సంస్థలు అండగా ఉంటాయని పేర్కొన్నారు . అదే విధంగా, క్యాన్సర్ హాస్పిటల్ కౌన్సిలింగ్ విభాగం అధినేత శ్రీమతి కన్యాకుమారి క్యాన్సర్ బాధితులకు వ్యక్తిగత కౌన్సిలింగ్ నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలపై సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. ఈ సేవా కార్యక్రమంలో డేవిడ్ లివింగ్ స్టోన్ , సత్య కుమార్ , క్రాంతి, నిఖిల్, కమల్, రమ, జయ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు వినియోగించుకోండి

## డాక్టర్ ప్రీతి సొలోమోన్



విడవలూరు, జనవరి 19, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు డాక్టర్. ప్రీతి సొలోమోన్ ఆధ్వర్యంలో మొదటిరోజు విడవలూరులో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరాల్లో పాడి పశువులకు పరీక్షలు, గొర్రెలకు బొబ్బర వ్యాధి నిరోధికా టీకాలు, కోళ్లకు కొక్కెర వ్యాధి నిరోధిక టీకాలు వేయడం జరిగిందని అన్నారు. పశువులు, గొర్రెలు,మేకలు, లేగ దూడలు నట్టల నివారణ మందును ఉచితంగా రైతన్నలకు అందజేశామన్నారు. ఈనెల 19 నుండి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు జరుగును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వి ఎల్ ఓ కృష్ణంరాజు, ఎల్ ఎస్ ఏ ఎస్.కె షరీనా, సిబ్బంది పాల్గొన్నారు.

## 31వ డివిజన్‌లో కామ్రేడ్ పెంచలయ్య స్మారక క్రీడా పోటీలు



**నెల్లూరు రూరల్, జనవరి 19, ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 31వ డివిజన్ పరిధిలోని శ్రీలంక కాలనీలో డివైఎఫ్ఐ - ఐద్వా భవనం ఆధ్వర్యంలో కామ్రేడ్ పెంచలయ్య స్మారక ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, యువత, మహిళలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాదు, 31వ డివిజన్ శాఖ కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ 31వ డివిజన్‌లో అనేక మౌలిక సమస్యలు నెలకొని ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా శ్రీలంక కాలనీలో ఉన్న అంగన్వాడీ స్కూలు దుస్థితిలో ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టి చిన్నారులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చుట్టుపక్కల చెట్లు, నిల్వ నీరు కారణంగా దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నారని, వెంటనే డ్రైనేజీ కాలువలు, రోడ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అనంతరం నిర్వహించిన వాలీబాల్ పోటీలు, ముగ్గుల పోటీల్లో యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న అన్ని మహిళలకు, క్రీడాకారులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పెంచల నరసయ్య, ఎస్‌కే షాహినా బేగం, వరలక్ష్మి, కోటేశ్వరరావు, సుధాకర్, నరసింహారెడ్డి, ఖాజావలి, రంగయ్య, సేనా రెడ్డి, ముత్యాలు, పెంచలయ్య, శివకుమార్, రాజకుమార్, కనకరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సాల్మన్ మృతిని ఖండించిన వైసీపీ నాయకులు

ఉదయగిరి, జనవరి 19, ప్రభాతవార్త పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త మంద సాల్మన్‌ను అమానుషంగా చంపేయడం దారుణమైన విషయమని దీనిని మన రాష్ట్రంలో ఉన్న అందరూ ముక్తకంఠంతో ఖండించాలని ఉదయగిరి వైసీపీ నాయకులు కోరారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని, రాష్ట్రంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయని, దీనిని ప్రజాస్వామ్యక వాదులు ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు ఖండించాలని కోరారు. వైసీపీకి రాష్ట్రంలోని దళితులు అందరూ అనుకూలంగా ఉన్నారని వారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వం చేయించిన హత్య అని మంద సాల్మన్ ను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సాల్మన్ కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వారి కుటుంబానికి 5 ఎకరాల పొలాన్ని మంజూరు చేసి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి పట్టణ వైసీపీ నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్, ఉదయగిరి మండల ఎస్సీ సెల్ నాయకులు ఉన్ని మొదల గురవయ్య, బెజవాడ నానాజీ, నాగేండ్ల గోవిందు, వైసీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కన్నె మరకల పెంచలయ్య, రావినూతల శ్రీను, నల్లిపోగు ప్రసాద్, కోసినపోగు అనిల్, క్రిస్టియన్ మనార్టీ మండల నాయకులు లక్కినేని సామాట్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఆస్థికి అసెస్మెంట్ ఉండేలా చర్యలు కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, జనవరి 19 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి ఆస్థికి అసెస్మెంట్ ఉండేలా తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వై.ఓ.నందన్ ఆదేశించారు. సోమవారం స్థానిక 37వ డివిజన్ మాగుంట లేవుట్ సరస్వతి నగర్ ప్రాంతంలో రెవెన్యూ విభాగం అదికా రులతో కలసి పర్యటించారు. అనంతరం సచివాల యం పరిధిలోని సివి.రామన్‌పాత హైస్కూల్ ప్రాంగణానికి సంబంధించి ఖాళీ స్థలం పన్నుల బకాయిలు ఉండడంతో సంబంధిత యజమానులతో మాట్లాడి వెంటనె చెల్లించ వల సిందిగా ఆదేశించారు. ఖాళీ స్థలం పన్నులు బకాయిలు ఉన్న స్థలాల్లో హెచ్చరిక నోటీసులు ఏర్పాటు చేయా లని అధికారులకు సూచరించారు. అనంతరం డివిజన్ పరిధిలోని వివిధ భవనాలకు ఆస్థిపన్నుల ఆసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారి సమద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సివిఎస్.కిరణ్, రవి, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంచి ప్రధాత చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



**కావలి, జనవరి 19 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ మంచి ప్రదాత(రహవీర) చట్టంపై అవగాహన కలిగి ఉండి రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారు ఈ చట్టాన్ని ఉపయోగించుకొని లబ్ది పొందాలని కావలి ప్రాంతీయ రవాణా అధికారి మురళీధర్ తెలిపారు. పట్టణంలో పలు వైద్యశాలల్లో రవాణాశాఖ ఆధ్వర్యంలో సోమవారం మంచి ప్రదాత చట్టానికి సంబందించిన పోస్టర్లను పలు వైద్యశాలలో ఆవిష్కరించి అంటించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సంఘటనతో సంబంధం లేకపోయినా అపరిచితులకు ఏమి ప్రతిఫలం ఆశించకుండా సాయం చేసే వ్యక్తిని రహవీర అంటారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సాయం అందించిప్రాణనష్టం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం మంచి ప్రదాత చట్టాన్ని కొన్ని నియమాలను పొందుపరచడం జరిగిందన్నారు.ఎంవిఐ ఆర్.సుందరరావు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, వైద్యఆలల సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు



**గూడూరు, జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 37వ రహదారి భద్రతా మాసోత్సవాల కార్యక్రమలో భాగంగా 20వ తేది మంగ ళవారం ఉదయం 10.30 గంటలకు గూడూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి కా ర్యాలయంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి రోడ్డు భద్రత అవగాహన కల్పిం చడానికి సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఆర్టీవో బిఎస్‌కె కిషోర్ పేర్కొన్నారు. అందువల్ల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రోడ్డు భద్రత గురించి తెలియపరిచే ముఖ్యమైన విషయాలు తెలుసుకోవాలని గూడూరు ఆర్టీవో బిఎస్‌కె కిషోర్ పిలుపునిచ్చారు.

## కాశీనాయనను దర్శించుకున్న వైసిపి నేతలు



**సీతారామపురం జనవరి 19 ప్రభాతవార్త** సద్గురు కాశీనాయన 130 వ జయంతి వేడుకలను ఆయన స్వగ్రామమైన సీతారామపురం మండలంలోని బెడుసుపల్లి గ్రామంలో కాశీనాయన ఆశ్రమం వద్ద ఘనంగా జరిగాయి.ఈ సందర్బంగా కాశీనాయనను వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర అధికార ప్రతినిధులు కారుమూరు వెంకటరెడ్డి, గూడపురెడ్డి శేఖర్‌రెడ్డి, జిల్లా వైసిపి సీనియర్‌నాయకులు మాజీ జడ్‌పిటిసి దుగిరెడ్డి గురవారెడ్డి, ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి, మండల వైసిపి కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి,ఎంపిటిసి పిసి అల్లూరు రాజు ,వైస్ ఎంపిపి బసిరెడ్డి కృష్ణారెడ్డి,యువనాయకులు చింతంరెడ్డి లోకేష్‌రెడ్డి, పాలగిరి ముద్దుకృష్ణమరాజులు కాశీనాయనను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారి తీర్ద ప్రసాదాలు స్వీకరించారు.ఆలయ అర్చకులు స్వామి వారి కండువాలు కప్పి అర్చనలు చేశారు. అనంతరం కాశీనాయన కుటుంబీకులను కలిసి మాట్లాడారు.

## కారు బోల్తా- బిజెపి నాయకుడుకి గాయాలు



**సీతారామపురం జనవరి 19 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని జాతీయ రహదారి లో సోమవారం తెల్లవారు జామున కారు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న గుంతలో పడింది.ఉదయగిరి నియోజకవర్గం బిజెపి నాయకులు ముడమాల రమేష్‌రెడ్డికి స్వల్పగాయాలు కాగా అతనితోపాటు పలువురుకి తీవ్ర గాయాలు అయ్యాయి. బెడుసుపల్లి కాశీనాయన ఉత్సవాలు ముగించుకొని పోలంగారి పల్లి కూడలి వద్ద బస్సు కోసం నిరీక్షిస్తున్న భక్తులు వేచిఉండడంతో అదే సమయానికి ఉదయగిరి వైపుగా వెళుతున్న ముడమాల రమేష్‌రెడ్డి తన కారులో ఎక్కించుకొని వెళుతుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి కారు బోల్తాపడింది.కారులో ఉన్న వారిలో ఉదయగిరి మండలంలోని కుర్రపల్లి గ్రామానికి చెందిన తిరుపతి,రమణమ్మ, వీరమ్మ, రామసుబ్బమ్మ, ఆత్మకూరులోని బట్టేపాడుకు చెందిన నరసింహులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రదమ చికిత్స నిమిత్తం 108 ద్వారా ఉదయగిరి వైద్యశాలకు తరలించారు.

## సుబ్బారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



**గూడూరు రూరల్, జనవరి 19, ప్రభాతవార్త** యద్దల సుబ్బారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పిఏసి సభ్యులు, కోవూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం గూడూరు నియోజకవర్గం వైసీపీ నాయకులు యద్దల నరేంద్ర రెడ్డి తండ్రి యద్దల వెంకట సుబ్బారెడ్డి అనారోగ్యంతో మరణించడంతో మంగళపూరు గ్రామంలోని వారి స్వగృహానికి మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పిఏసి సభ్యులు, కోవూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, వైసిపి రాష్ట్ర సిఈసి సభ్యులు పెర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డిలు వెళ్లి నరేంద్ర రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు, వైసీపీ సీనియర్ నాయకులు కలువ బాలశంకర్ రెడ్డి, మల్లు విజయ్ కుమార్ రెడ్డి, చెన్నూరు రాజారెడ్డి, మూలి కిషోర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మద్దాలి ట్రస్టుచే ఆర్థిక సహాయం



**కోట, జనవరి19 ప్రభాతవార్త** కోట పంచాయతీలోని శ్యామ్ సుందరంపురంలో గండి కోట కస్తూరయ్య కుటుం బానికి మద్దాలి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఐదు వేల రూ పాయాలను ఆర్థిక సహాయం అందచేశామని ట్రస్ట్ చైర్మెన్ మద్దాలి సర్వోత్తమ్ రెడ్డి చెప్పారు. ఈ సందర్బంగా ట్రస్ట్ చైర్మెన్ ఎం.సర్వోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ కోట గ్రామా నికి చెందిన 20 మంది సభ్యులతో ఈ ట్రస్ట్‌ను ప్రారంభిం చడం జరిగిందన్నారు. పంచాయతీలోని ఎవరైన పేద కు టుంబాల్లో వారు అనుకొకుండా మృతి చెందింతే అటువంటి కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సహ యం కింది ఐదు వేల రూపాయాలను ఇవ్వడం జరుగుతుందన్నారు.ట్రస్టు ద్వారా సహాయ కార్యక్రమాలు నిరం తరం కొనసాగిస్తామన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు తీగల సురేష్‌బాబు, తూపిలి రాధాకృష్ణారెడ్డి సుహాసిని, మోహన్ పంత్రగం వసంత్ , సుధీర్‌కుమార్‌రెడ్డి, మర్రి అనిల్, నాగార్జున, నీలిమ, పాల్గొన్నారు.

## వీఆర్వోలు సమస్యలను సుదీర్ఘంగా పరిష్కరించాలి: స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, జనవరి 19, ప్రభాతవార్త :** మండలంలో ఉన్న గ్రామ విఆర్వోలు ఆయా గ్రామ ప్రజా, రైతు సమస్యలను సుదీ ర్ఘంగా పరిశీలన చేసి పరిష్కారం చేయాలని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహ శీల్దార్ కార్యాలయంలో సోమ వారం ప్రజా సమస్యల ప్రజా వేదిక లో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో రైతులు పాసు పుస్తకంలో సవరణ, అడంగల్, వన్ బి, భూమి విస్తరణం సమస్యల పై దృష్టి సారించాలని విఆర్వోలకు సూచించారు. ప్రజల వద్ద నుండి వచ్చే అర్జీలపై పరిశీలన చేపట్టి వెంటనే పరిష్కారం చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఆర్ ఐ హైమావతి, మండల సర్వేయర్ మహేశ్వరరావు, ఏ ఎస్ ఓ గాయత్రి, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## కావల్ రెడ్డి వెంకటరమణారెడ్డి మృతి

**- కుటుంబాన్ని పరామర్శించిన ప్రముఖులు**



**తోటపల్లి గూడూరు, జనవరి 19, ప్రభాతవార్త** మండలంలోని కొత్త కోడూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, రైతు నేత కావల్ రెడ్డి వెంకటరమణారెడ్డి ఇటీవల మృతి చెందడం గ్రామాన్ని తీవ్రంగా కలిచివేసింది. ఆయన మృతి పట్ల గ్రామ ప్రజలు, రైతాంగం తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. దివంగత వెంకటరమణారెడ్డి కుమారులు నరేంద్ర రెడ్డి, సురేంద్ర రెడ్డిలను పరామర్శిం చేందుకు బంధుమిత్రులతో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శనివారం కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కావల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే సోమవారం ఆంధ్రప్రదేశ్ మాజీ అదనపు అడ్వకేట్ జనరల్, వైయస్సార్సీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి స్థానికులతో కలిసి దివంగత వెంకటరమణారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నెల్లూరు క్లబ్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి కూడా పరామర్శించిన వారిలో ఉన్నారు. దివంగత వెంకటరమణారెడ్డి కుమారుడు నరేంద్ర రెడ్డి గ్రామ సర్పంచ్‌గా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా సేవలందించి ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. మరో కుమారుడు సురేంద్ర నాద రెడ్డి మాజీ జాఫర్ సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా రైతాంగానికి సేవలందించడంతో పాటు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా పనిచేశారు. ప్రస్తుతం న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. వీరికి ఉన్న విస్తృత పరిచయాల కారణంగా రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పరామర్శకు రావడం విశేషంగా మారింది. గ్రామంలో శోకసంద్ర వాతావరణం నెలకొంది.

## మాజీఎమ్మెల్యేను కలిసిన నాయకులు



**అనంతసాగరం, జనవరి 19, ప్రభాతవార్త :** ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని నెల్లూరులో ఆయన నివాసంలో సోమవారం అనంతసాగరం మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, వైసిపి రాష్ట్ర ఉపాధ్యాయ ఉపాధ్యక్షుడు మెట్టుకూరు సుబ్బారెడ్డిలు కలిశారు.ఈసందర్బంగా విక్రమ్‌రెడ్డిని శాలువాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెట్టుకూరు సుబ్బారెడ్డి వైఎస్ఆర్‌టిఎ డైరీని విక్రమ్‌రెడ్డికి అందజేశారు.

## విజయ డైరీ చైర్మన్‌గా ఆర్‌వి ప్రసాద్ నాయుడు



**ఇందుకూరుపేట, జనవరి 19, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలంలోని కొరుటూరు గ్రామానికి చెందిన రావెళ్ళ వెంకటేశ్వర ప్రసాద్ నాయుడును నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం( విజయ డైరీ) చైర్మన్ గా పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో సోమవారం ఎంపిక చేశారు. ఆర్‌వి ప్రసాద్ నాయుడు గత 35 సంవత్సరాలుగా కొరుటూరు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ప్రెసిడెంట్‌గా 15 సంవత్సరాలుగా విజయడైరీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రసాద్ నాయుడు నియామకం పట్ల ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## రౌడీషీటర్లను రోడ్డుపై నడిపించిన పోలీసులు



**కోట, జనవరి 19 ప్రభాతవార్త** మండల కేంద్రమైన కోటలో ఐదుగురు రౌడీషీటర్లను గూడూరు రూరల్ సిఐ కిషోర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ రోడ్డుపై నడిపించారు. కోటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే రాకేష్‌పై దాడి చేసిన సంఘటన నేపథ్యంలో సూర్యతేజ, అరుణ్‌కుమార్, కాంబ్లే, కల్యాణ్, దొరబాబులను కోట పోలీసుస్టేషన్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ప్రజలందరూ చూస్తుండగా రోడ్డుపై నడిపించారు. ప్రజలు కూడా వారి పట్ల ఒకింత ఆశ్చర్యంగా చూశారు. ఎవరైనా అసాంఘిక శక్తులు ఘర్షణకు పాల్పడినా, దౌర్జన్యాలకు పాల్పడినా ఇలాంటివి తప్పవని సీఐ హెచ్చరించారు.

## పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

### డాక్టర్ టి.సోమయ్య



**నెల్లూరు అగ్రికల్చర్, జనవరి 19, ప్రభాతవార్త** నెల్లూరు అర్బన్ పరిధిలో ఈనెల 19 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహి స్తున్నామని, పశు పోషకులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసం వర్ధకశాఖ ఉప సంచాలకులు టి.సోమయ్య కోరారు. సోమవారం పశుసంవర్ధకశాఖ జిల్లా కార్యాలయం, కాపాడిపాలెంలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పశుసంవర్ధకశాఖ నుంచి వెటర్నరీ పాలి క్లినిక్ సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ శిబిరాలలో వైద్యులు డాక్టర్ జి.కృష్ణమూర్తి, డాక్టర్ సీహెచ్ రామచంద్రరావు, డాక్టర్ టి.జయప్రకాష్ పాల్గొని పశువుల వ్యాధులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాల్లో వివిధ రకాల పశు వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, గర్భకోశవ్యాధులను గుర్తించి తగిన చికిత్స అందించడం, పెద్ద పశువులకు లేగ దూడలకు ఏలిక పాముల మందులు తాగించడం, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించడం తదితర సేవలు అందుతున్నాయన్నారు. సోమవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాలలో 264 పశువులకు వైద్య సేవలు అందించడంతో పాటు 56 లేగదూడలకు, పశువులకు మందులు తాగించడం జరిగిందన్నారు. అలాగే 189 కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా టీకాలు వేస్తామని, 15 గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు వైద్య సేవలు అందించడం జరిగిందని వివరించారు. ఇందులో 14 అనారోగ్యంతో ఉన్న పశువులకు తగిన చికిత్స అందించామని తెలిపారు. ఈ పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పారదర్శకంగా ఎరువుల సరఫరా : పి.సత్యవాణి



**నెల్లూరు అగ్రికల్చర్, జనవరి 19, ప్రభాతవార్త** రసాయనిక ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మించి అధిక ధరలకు విక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. నిర్దేశించిన విక్రయ కేంద్రాలు అన్నింటి ద్వారా సమృద్ధిగా ఎరువుల సరఫరా జరుగుతోందని అన్నారు. ఈ రబీలో అన్ని పంటలకు అవసరమైన 94,383 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. 31 వరకు జిల్లాకు అవసరానికి మించి 82,140 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని వెల్లడించారు. గత అక్టోబర్ నెల నుంచి ఈ నెల 19వరకు జిల్లాలో మొత్తం 72,509 మెట్రిక్ టన్నుల యూరియాను విక్రయించడం జరిగిందన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చేసిన నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, యూరియాకు ప్రత్యామ్నాయంగా వీటిని కూడా రైతులు వాడుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు.

## అమరజీవి జాకీర్ స్మరణార్థం భారీ అన్నదానం



**నెల్లూరు, జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** నగర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి, పేదల పాలిట ఆపద్బాంధవుడిగా పేరు తెచ్చుకున్న 42, 43 క్లస్టర్ ఇన్‌చార్జి జాకీర్‌అకాల మరణం తర్వాత కూడా ఆయన జ్ఞాపకాలు నగరాన్ని వీడటం లేదు. ఆయన స్మరణార్థం కుటుంబ సభ్యులు, ఆత్మీయ మిత్రులు చేపట్టిన సేవా కార్యక్రమాలు ఆయన వ్యక్తిత్వాన్ని మరో సారి చాటిచెప్పాయి. సోమవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయం వద్ద జాకీర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**కిటకిటలాడిన పార్టీ కార్యాలయం:** జాకీర్ మరణం వార్త విన్నప్పటి నుండి విషాధంలో ఉన్న అభిమానులు, కార్యకర్తలు ఈ అన్నదాన కార్యక్రమానికి భారీగా తతరలివచ్చారు. కేవలం పార్టీ శ్రేణులే కాకుండా ఆయన నిరంతరం సేవ చేసే 42 ,43 డివిజన్ల ప్రజలు, పేదలు వేలాదిగా తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యాలయ పరిసరాలన్నీ ఆయన నామస్మరణతో మార్మోగాయి. జాకీర్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆయనకు ప్రజలకు సేవ చేయడమే పరమావది అని, ఎప్పుడూ తన వద్దకు వచ్చే పేదవాడి ఆకలి తీర్చాలని పరితపించేవారని, ఆయన భౌతికంగా మా మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలను ఈ సేవా కార్యక్రమాల ద్వారా కొనసాగిస్తాం అని భావోద్వేగానికి లోనయ్యారు. మంత్రి నారాయణకి అత్యంత సన్నిహితుడగా, నమ్మకస్తుడిగా పేరున్న జాకీర్ నివాళి కార్యక్రమంలో పలువురు ప్రముఖ నేతలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జాకీర్ లేని లోటు పూడ్చలేనిదని, మొన్నటి అంతిమ యాత్రలో మంత్రి నారాయణ పాడె మోసి ఆయన విలువను చాటి చెప్పారు. ఈ రోజు ఇక్కడ కనిపిస్తున్న జనసందోహమే ఆయన ఎంత గొప్ప నాయకుడో చెబుతోందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ఆయన పేరు పెట్టాలన్న ప్రతిపాదన ఆయన సేవలకు ఇచ్చే నిజమైన గౌరవం అని కొనియాడారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు, టీడీపీ నగర నాయకులు, క్లస్టర్ పరిధిలోని కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాకీర్‌కి ఘనంగా నివాళులర్పించారు.

## జెడ్పీలో ఘనంగా వేమన జయంతి వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 19, ప్రభాతవార్త** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం యోగి వేమన జయంతిని జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జెడ్పీలో నేడు ఏడు స్థాయి సంఘ సమావేశాలు



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 19, ప్రభాతవార్త** నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ ఏడు (07) స్థాయి సంఘ సమావేశములను నిర్వహిస్తున్నట్టు జడ్పీ సీఈవో శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖతో, జిల్లా పంచాయితీ రాజ్ శాఖ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ,జిల్లా పరి శ్రమల శాఖ, జిల్లా ఉపాది కల్పన శాఖ, జిల్లా మత్స్య శాఖ, జిల్లా ఉద్యానవన శాఖ మైక్రో ఇరిగేషన్ శాఖ, జిల్లా విద్యా శాఖ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఐటిడిఏ శాఖ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, తదితర శాఖలతో సమీక్ష నిర్వహిస్తున్నట్టు యల్. శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

## కలెక్టర్‌చే ఏపీ ఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణ



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 19, ప్రభాతవార్త** ఏపీ ఎన్జీవోస్ జిల్లా నూతన క్యాలెండర్‌ను, జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లచే సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు బండారిపల్లి వెంకటే శ్వర్లు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, ఉపాధ్యక్షులు పి.కిరణ్ కుమార్, పి. సతీష్ బాబు, పి జనార్దన్ రావు, ఈ. కరుణమ్మ, ఆర్గనైజ్ సెక్రెటరీ లక్కాకుల పెంచలయ్య, జాయింట్ సెక్రెటరీ సిహెచ్ వీరబ్రహ్మేశ్వరరావు, కే సురేష్, ఎన్ రాజేంద్ర, పి.రమ్య నగర అధ్యక్షులు చిలక రామకృష్ణారెడ్డి, కార్యదర్శి కృష్ణ కుమార్, మహిళ చైర్ పర్సన్ ఎల్ నవోదయ, కన్వీనర్ జిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సూర్య జయంతి, రథసప్తమి సందర్బంగా

## 20వ జ్ఞాన యజ్ఞం



**బుచ్చి జనవరి 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీవాసవీకన్య కాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం పక్కన సత్యాన్వేషణ ధ్యాన యోగ ఆధ్యాత్మిక క్షేత్రం నందు 21 వతేది నుండి 25 వ తేది వరకు సూర్య జయంతి,రథసప్తమి సందర్భంగా 20వ జ్ఞాన యజ్ఞం జరగనున్నట్లు యోగా గురువులు గుబ్బా లక్ష్మీనారాయణ తె లిపారు. 21 వ తేది జ్యోతి ప్రజ్వలన ప్రార్ధన అనంతరం ప్రవచనం బ్రహ్మర్షి కుమారస్వామి అచార్యులు మనుబ్రహ్మ (శ్రీకనకదుర్గ పోలేరమ్మ క్షేత్రం చారిటబుల్ ట్రస్టు కనిగిరి రిజర్వాయర్), 22 వ తేది గురువారం సాయింత్రం 3.30 నిమి షాలకు వ్యక్తిత్వ వికాసంపై డాక్టర్ కరిమద్దెల నరసింహారెడ్డి ప్రసంగం, 23 వ తేది సాయింత్రం 3 గంటలకు పంచభూతల హీలింగ్ రేకీహీలింగ్ మాష్టర్ పి.విజయ్‌కుమార్‌రెడ్డి గారు నిర్వహించనున్నట్లు తెలిపారు. 24 వ తేది గంటా నారాయణరెడ్డి (సంగం ) వారి ఆద్మాత్మిక తత్వబోధక్ ఉంటుందని అన్నారు. 25 వ తేధి రథసప్తమి పర్వదినం పురస్కరించుకోని 5 గంటల నుండి నగర సంకీర్తన్,6 గంటలకు సూర్య నమస్కారాలు,7 గంటలకు గోపూజ, సూర్యారాధన, ఆదిత్య హృదయం, సూర్యాష్టకం, విష్ణు సహస్రనామ పారాయణం, భజనలు ఉదయం 9 గంటల నుండి సామూహిక హోమాలు నెల్లూరు జిల్లా పతంజిలి టీమ్ పెంచలయ్య, విజయకుమార్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి రవీంద్రల చే నిర్వహించబడును. ఉదయం 11 గంటలకు బ్రహ్మశ్రీ నజీర్‌బాషా గురువుచే గీతా సందేశం, తదుపరి వర్ధమాన గాయకులు శ్రీరాయనం వెంకటరమేష్ కందుకూరు వారిచే అన్నమాచార్య కీర్తనలు, భక్తి గీతాలు, మద్యహ్నం 11 గంటలకు అన్న ప్రసాద వితరణ యోగసాధకులు,భక్తులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## యోగి వేమనకు ఘన నివాళులు



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త :** మహా కవి యోగి వేమన జయంతిని పురస్కరించుకుని సోమవారం కోవూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి డీఈ శ్రీనివాస్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ యోగి వేమన తన బోధనల ద్వారా తెలుగు సాహిత్యంలో శాశ్వత స్థానం సంపాదించారన్నారు. ఆ మహనీయుని సరళమైన పదాల ద్వారా మానవతా విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలు ఎం. జగదీష్, టి. వెంకటహరిత, ఆర్. హరికృష్ణ, కె. కార్తీక్, జేటీవో ఆర్. పెంచలరామ్, సీనియర్ అసిస్టెంట్ ఎం. శ్రీకాంత్ కుమార్, టైపిస్ట్ బి. రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు,ఆఫీస్ సబార్డినేట్‌లు ఏ. బాబు, అమ్ములు ఉన్నారు.

## జీవీఎన్ శేఖర్‌రెడ్డిని పరామర్శించిన చేజర్ల



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీఎన్ శేఖర్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు వారి నివాసంలో శేఖర్‌రెడ్డిని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. ఆయన వెంట టీడీపీ ముదిరాజ్ సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ పీఎల్‌రావు, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు ఎస్‌కే రసూల్, తదితరులు ఉన్నారు.

## 91వ సారి రక్తదానం చేసిన దేవిరెడ్డి



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త :** కోవూరుకు చెందిన సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు సేవా తత్పరులైన దేవిరెడ్డి సురేష్‌రెడ్డి 91వ సారి రక్తదానం చేశారు. నెల్లూరులోని రక్తనిధికి వెళ్లి దేవిరెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి యువత స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమానికి తోడ్పడాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.ఆయనను సహచర మిత్రులు , బంధువులు అభినందించారు.

## నగరంలో సందడి చేసిన అనగనగా ఒకరాజు చిత్ర బృందం



**నెల్లూరు, జనవరి 19, ప్రభాతవార్త-విద్య :** అనగనగా ఒకరాజు చిత్ర యూనిట్ సోమవారం నెల్లూరు నగరంలో సందడి చేసింది. ఇటీవల విడుదలైన అనగనగా ఒకరాజు చిత్రం విజయవంతం కావడంతో చిత్ర యూనిట్ విజయ యాత్రలో భాగంగా నెల్లూరు నగరంలోని ఎస్ 2 సినీ థియేటర్లో విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. అనగనగా ఒకరాజు సినిమా ప్రదర్శనలో చిత్ర కథానాయకుడు నవీన్ పోలిశెట్టి అభిమానులను కలిసి సందడి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వరుసగా తనకు నాల్గవ చిత్రం అనగనగా ఒకరాజు చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి విజయవంతం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మొదటి సారి రూ.100 కోట్ల క్లబ్లో తన చిత్రం చేరడంతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్తో పాటు విదేశాల్లో కూడా విజయ వంతంగా దూసుకుపోవడం ఆనందంగా ఉందన్నారు. తొలిసారిగా ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాల్లో నటించడం జరిగిందని, తనను యాక్షన్ దృశ్యాల్లో కూడా ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తూ థియేటర్లలో సందడి చేస్తున్నారన్నారు. ఇంతటి విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, అదేవిధంగా ఈ చిత్రాన్ని ఇంకా చూడని ప్రేక్షకులు కుటుంబ సమేతంగా థియేటర్లకు విచ్చేసి చూడాలన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రేక్షకులు తమ చిత్రానికి ఘన విజయాన్ని అందించారన్నారు. అలాగే మొదటి చిత్రం ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ చిత్రం దాదాపు 90 శాతం నెల్లూరులోనే చిత్రీకరించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి తనకు నెల్లూరుతో ప్రత్యేక అనుబంధం ఉందని, అందుకే తన ప్రతి చిత్రం విజయోత్సవ కార్యక్రమంలో నగరానికి విచ్చేస్తున్నానని తెలిపారు. ఈ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు, చిత్ర యూనిట్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిత్ర దర్శకుడు మారీ, క్రియేటివ్ డైరెక్టర్ చిన్మయి. డిస్ట్రిబ్యూటర్ భాస్కరెడ్డి, ఎస్2 సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జనవరి 19 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షిసమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మాఘమాసం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య స్వామివారికి అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా శివభక్త బృందం వ్యవహరించారు.మాజీ శివాలయం చైర్మన్ సురేష్, మాజీ ధర్మకర్త పాటూరు మోహన్, భక్తులు ఉన్నారు.